ఊరిలో వానరం.. ప్రజల కలవరం

- బెంబేలెత్తిస్తున్న కోతులు
- ప్రజలకు తప్పని అవస్థలు



రాజానగరంలో వానరాల సంచారం

రాజానగరం: రియల్ ఎస్టేట్ ప్రభావంతో పంట భూములు, పండ్ల తోటలు తరిగిపోతున్నాయి. వనాలపై ఆధారపడి జీవించే వానరాలు ఆకలి దప్పికలు తీర్చుకునేందుకు ఊరిలోకి వస్తున్నాయి. దారిలేక ప్రజలపై దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నాయి.చేతికి దొరికిన వస్తువులను ఎగరేసుకుపోయి, చిందరవందర చేసేస్తున్నాయి. వీటి చేష్టలను ప్రజలు భరించలేకపోతున్నారు.

తప్పని బెడద

వానరాల బెడద మెట్ట ప్రాంతంలోని దాదాపుగా ప్రతి గ్రామంలోనూ ఉంది. అయితే జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రాజానగరం, దివాన్ చెరువు, లాలాచెరువు హెచ్‌బీ కాలనీల్లో విపరీతంగా ఉంది. ఇతర గ్రామాల్లో ఉన్న వానరాలను ఆయా పంచాయతీలు పట్టించి, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ గ్రామాలలో రాత్రి సమయాలలో వదిలేస్తున్నారు. దీనితో ఇక్కడ పంచాయతీ సిబ్బంది జనం పోరు పడలేక అడపా దడపా వానరాలను పట్టించి, దూరంగా వదిలేస్తున్నాగాని, ఏవిధమైన ప్రయోజనం ఉండటం లేదు.

తోటలు తగ్గిపోవడంతో..

సుమారు రెండు దశాబ్దాల క్రితం వరకు గ్రామీణ ప్రాంతాలలో వానరాల బెడద ఎక్కువగా ఉండేది కాదు. ఎందుకంటే ఆ సమయంలో రియల్ పెద్దగా లేకపోవడంతో పండ్ల తోటలతో పాటు అపరాల సాగు ఎక్కుగా జరుగుతుండేది. మామిడి, జీడి మామిడి, సపోటా, బత్తాయి, జామ, సీతాఫలం, దానిమ్మ ఇలా అనేక రకాల పండ్ల తోటలు విస్తరంగా ఉండేవి. వీటిపై అనుకూలమైన సమయాలలో దాడి చేసి, తమ ఆహారాన్ని ఆ వానరాలు సంపాదించుకునేవి. కానీ స్పీడు యుగంలో పెరుగుతున్న సాంకేతిక అభివద్ధితో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగడం ప్రారంభమై, పండ్ల తోటలనే కాకుండా సాగు భూములను కూడా హరించి వేస్తోంది. ఈ తరుణంలో వానరాలకు ఆహారం దొరకడం గగనమైపోయి, జనావాసాలపై పడి తమ ఆహారాన్ని వెదుక్కుంటున్నాయి.

కొరవడిన శ్రద్ధ

గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న వానరాల బెడదను నివారించాలంటే వాటిని పట్టించి, అడవులలో వదిలేయాలని గ్రామస్తులు సూచిస్తున్నారు. కానీ ఆ విధంగా శ్రద్ధ తీసుకునే అధికారులే కానరావడం లేదు. జనం బాధ పడలేక, కొంత మంది పెద్దల మాటలను కాదనలేక గ్రామ పంచాయతీ అధికారులు వానరాలను పట్టించే ప్రయత్నం చేస్తున్నాగాని, దానిలో చిత్తశుద్ధి లేక అరకొరగానే సాగుతోంది.

ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి

ఏమరుపాటుగా ఉంటే చాలు వానరాలు ఇళ్లలోకి చొరబడిపోతున్నాయి. వీటిలో పెద్ద వానరాలుంటే ఇక జనాన్ని హడలెత్తిస్తున్నాయి. కొట్టబోతుంటే మీదకు దుమికి రక్కేస్తున్నాయి. టపాసులు పేల్చినా భయపడటం లేదు. ఆహార పదార్థాలను, తినుబండారాలను పాడుచేస్తున్నాయి.

– తుమ్మలపల్లి సుజాత, గృహిణి, రాజానగరం

ఎన్నిసార్లు పట్టించినా తగ్గడం లేదు

ఇప్పటికి నాలుగైదు సార్లు వానరాలను పట్టించి, దూరంగా వదిలేసేలా చర్యలు తీసుకున్నాం. అయినాగాని పదేపదే వచ్చేస్తున్నాయి, వాటి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. వాటిని పట్టుకునేందుకు బోన్లు పెడుతుంటే ఆ సమయంలో ఒక్కటి కూడా కనిపించడం లేదు. ఆ తరువాత అదే ప్రాంతంలో జనం వానరాలు ఇళ్లలోకి వచేస్తున్నాయంటూ ఫిర్యాదు చేస్తున్నారు. అవి కూడా తెలివిగానే వ్యవహరిస్తున్నాయి.

– మేకా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, రాజానగరం

క్లుప్తంగా

కొమరిపాలెంలో కేరళ బృందం పర్యటన


కొమరిపాలెంలో కేరళ బృంద సభ్యుడు రషీద్

బిక్కవోలు: ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌ఓ) సర్టిఫికెట్ కోసం జిల్లాలో రెండు పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో కొమరి పాలెం పంచాయతీ ఉంది. గురువారం గ్రామంలో కేరళ బృందం సభ్యుడు రషీద్ పర్యటించారు. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవనం, సచివాలయ స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, సచివాలయ నిర్వహణ చాలా బాగుందన్నారు. సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ

గోకవరం: రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీల్లో మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దాడి దుర్గాదేవి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం తెలిపారు. ఈ నెల 8న అమలాపురం, అనపర్తిలో జరిగిన ఎస్జీఎఫ్ డ్రాయింగ్ పోటీలో దుర్గాదేవి ప్రతిభ చూపి నాల్గో స్థానంలో నిలిచిందన్నారు. అలాగే అండర్-17 విభాగంలో వేమగిరి విజయ్‌కుమార్ త్రో బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు పీఎంసీ చైర్మన్ పి.చిన్ని, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు అభినందించారు.

ఉత్సవాలకు రాట ముహూర్తం

బిక్కవోలు: పందలపాక గ్రామంలో శ్రీసంతోషి, అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నవరాత్ర ఉత్సవాలకు కర్రి శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతులు రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 24 వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, గురుస్వాములు అన్నవరం, తుమ్మూరి వెంకటరమణ, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, కమిటీ సభ్యులు బొడ్డు వెంకటశ్రీను, వేమన, కొటాని గోపాలకృష్ణ, కె.లోకేష్, కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

పెదపూడి: శహాపురం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో ప్రసూతి, కంటి, చిన్నపిల్లలు, జనరల్ ఫిజీషియన్, ఎముకల విభాగాల్లో వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు పొందవచ్చన్నారు. అలాగే అవసరమైన వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన శస్త్రచికిత్సలు చేయిస్తారన్నారు.

పారిశుధ్యం మరింత మెరుగుపరచాలి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపరచాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం పెదపూడి, దోమాడలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్త, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలన్నారు. బ్లీచింగ్ చల్లించాలన్నారు. దోమల నివారణకు ఎబేట్ మందు పిచికారీ చేయాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. వీటిని సచివాలయ అధికారులు బాధ్యతగా తీసుకోవాలన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

బిక్కవోలు: కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైందని ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. బలభద్రపురం కాలువలో రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల బాలవిజయ దుర్గాప్రసాద్ (17) బుధవారం స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. అతడి మృతదేహం గురువారం ఉదయం కాలువలో గుర్తించారు. దీనిని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు.

వడ్డీ వ్యాపారిపై దాడి

చింతపల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ సోమవరంలో వడ్డీ వ్యాపారిపై ఇద్దరు ఆయుధాలతో దాడి చేశారు. బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన ఉగిరెడ్డి అనివాసరెడ్డి కొన్నేళ్లుగా లోతుగెడ్డ జంక్షన్‌లో మకాం ఉంటూ వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. గురువారం ఉదయం అన్నవరం మీదుగా సోమవరం వెళుతుండగా ఇద్దరు దుండగులు ఆయుధాలతో దాడికి దిగారు. ముఖం, తలపై తీవ్రమైన గాయాలు కావడంతో బాధితుడు కుప్పకూలిపోయాడు. దీంతో దుండగులు అతని జేబులో ఉన్న రూ.50 వేలు, సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. అనివాసరెడ్డికి చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

700 క్యూసెక్కుల సాగునీరు విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి మెట్ట ప్రాంత పొలాలకు గురువారం 700 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు తెలిపారు. పుష్కర 1 నుంచి మూడు, 2 నుంచి ఒక మోటారు ద్వారా పంపిణీ జరిగిందన్నారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 15.6 మీటర్లు ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: స్థానిక పాతవూరులోని అనపోతవరం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ స్థానిక పాతవూరు ధరణికోట, తహసీల్దార్ కార్యాలయం ప్రాంతం, నారాయణ నూతివీధి, కుమ్మరవీధి, మసీద్ సెంటర్, బాపనమ్మ గుడివీధి, పాలమూరుపాకలు, సావరం కాలనీ, దేవస్థానం కాలనీ, టీటీడీ కల్యాణ మంటపం, సీడీఆర్ ఆసుపత్రి ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


చినకొండేపూడిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్బీకే చైర్మన్ వెంకట్రాజు


కాటవరంలో ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణారావు

సీతానగరం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ గరిమెళ్ల శ్రీనివాస్, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు అన్నారు. చినకొండేపూడిలో కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అలాగే మిర్తిపాడు, కాటవరాల్లో కేంద్రాలను తహసీల్దార్ పి.కృష్ణారావు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ రైతులకు మంచి ధర కల్పించే ఉద్దేశంతో నేరుగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. 100 కిలోల ధాన్యానికి రూ.2,183, అలాగే 75 కిలోల ధాన్యానికి రూ.1,667.25 రైతుల ఖాతాలోకి నేరుగా జమ అవుతుందన్నారు. కేంద్రాల వద్ద కాటాలు, మాయిశ్చరైజర్ మిషన్లు, కంప్యూటర్లు ఏర్పాటు చేశామని, అలాగే వీఏఏలకు సహాయంగా డేటా ఎంట్రీ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్, హెల్పర్లను నియమించామన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్‌లు చెరుకూరి శ్రీనివాస్, బంగారు సత్యవతి, ఉప సర్పంచ్‌లు సత్తి పండురాజు, కోన రామకృష్ణ ఎంపీటీసీలు తాడిపల్లి వెంకట్రావు, మాకిరెడ్డి దేవి, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, పోలినాటి రామచంద్రరావు, జొన్నలగడ్డ సత్యనారాయణ, బంగారయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


బిక్కవోలులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం బిక్కవోలు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని తిరిగి గెలిపించి, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, నాయకులు గువ్వల సత్తిరెడ్డి, గొర్రెల రామకృష్ణ, వంగా గోపి, ఆర్ఎస్‌పేట మాజీ సర్పంచ్ యామన దుర్గారావు, ఊలపల్లి ఎంపీటీసీ బందారు శివ, బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక


రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రంగంపేట: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వి.పార్థసారథి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14, 17 విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారన్నారు. అండర్-14 విభాగంలో కోడూరి యవ్వన, కె.జాహ్నవిసాయి వీరలక్ష్మి, అండర్-17 విభాగంలో కె.సతీష్, ఎస్.శ్రీనివాస్ ఎంపికయ్యారన్నారు. ఎంపికై న విద్యార్థులను తనతో పాటు ఉపాధ్యాయులు అభినందించారని తెలిపారు.

నేటి నుంచి ఆటల పోటీలు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉమెన్ మెడికోస్ గేమ్స్ జరుగనున్నాయి. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కాలేజీల విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొంటారు. వాలీబాల్, బాస్కెట్ బాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు జరగనున్నాయని పీడీ శ్రీనివాసులు తెలిపారు.

ఆర్బీకే చైర్మన్‌కు మాతృవియోగం

సీతానగరం: మండలంలోని కూనవరానికి చెందిన గ్రామ ఆర్బీకే కమిటీ చైర్మన్ నల్లమోలు పాపారావు తల్లి భూలక్ష్మి (85) మృతి చెందారు. అనారోగ్య కారణాలతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 8 గంటలకు కన్నుమూశారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, కుమారుడు పాపారావు ఉన్నారు. పాపారావును పార్టీ నాయకులు పరామర్శించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


సీఎం జగన్‌తో మాట్లాడుతున్న సత్యనారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి


పెదపూడి: కరకుదురులో కాపు కల్యాణ మంటపానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ తెలిపారు. సామర్లకోటలో గృహ నిర్మాణాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వుండ్రు సత్యనారాయణ మాట్లాడుతూ అదే గ్రామంలో ఏడున్నర ఎకరాల ఇళ్ల స్థలాలు మెరక చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఆ స్థలాలకు కోర్టు ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సహకారంలో తొలగిపోయాయని సీఎం జగన్‌కు వివరించానన్నారు. కరకుదురులో పశ్చిమ ఏలేరు కాలువ కుచించిపోయిందని వరదలు, తుపాన్ల సమయంలో ఈ గ్రామంతో పాటు దోమాడ, పెదపూడి, ఏపీ త్రయం రామేశ్వరం తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో వరి పొలాలు నీటి ముంపునకు గురై పంట నష్టపోతుందన్నారు. అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్నారని ఈ నేపథ్యంలో తక్షణం ఆ పశ్చిమ ఏలేరు కాలువ ఆధునీకరించాలని సీఎం జగన్‌ని కోరానన్నారు. వీటిపై ముఖ్యమంత్రి జగన్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ఉపాధి గ్రామసభలో మాట్లాడుతున్న గోవిందు

రంగంపేట: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు అన్నారు. గురువారం పెదరాయవరం గ్రామ సచివాలయంలో సర్పంచ్ బరగటి సుజాత అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల గురించి చర్చించారు. ఉపాధి పథకం ఏపీఓ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పథకం ఆవశ్యకత, గత ఏడాదిలో చేపట్టిన పనుల వివరాలను తెలిపారు. కొత్తగా 41 పనులను గుర్తించామని వాటిని అందరికీ వివరించారు. ఉప సర్పంచ్ మద్దిపాటి వీర్రాజు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

- సుస్వాగతం..



కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లకు గృహ ప్రవేశాలు చేసి రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో సామర్లకోట వచ్చిన ఆయనకు అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వాగతం పలికారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం


గోకవరంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు


ఎస్టీ రాజాపురంలో రోగులకు మందులు అందిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు తదితరులు


ఉండేశ్వరపురంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రాజు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వైద్య సేవలందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్‌ని పరిశీలించి గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, సర్పంచ్ కొమరం శ్రావణి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష

బిక్కవోలు: పేదలు ఆరోగ్యంగా ఉండాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ అన్నారు. కాపవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. అనంతరం వైద్యులు 606 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు జి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆరోగ్యవంతులుగా చేసేందుకే..

రంగంపేట: పేదల ఆరోగ్య సంరక్షణ కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. ఎస్టీ రాజాపురం గ్రామంలో సర్పంచ్ అడ్డాల పద్మ అధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యా, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదలందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం ధ్యేయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలంతా వినియోగించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్లు షమ్మీకుమార్, గంగాధర్, అంజనీశ్వేత, కె.విఘ్నేష్ తదితరులు 532 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్, వైస్ సర్పంచ్ గురజారపు కిరణ్, ఎంపీటీసీ పప్పు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

604 మందికి వైద్య పరీక్షలు

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురంలో నిర్వహించిన శిబిరంలో 604 మందికి వైద్య సేవలు అందించారు. డాక్టర్లు ఏవీకే చైతన్య, రాజు, ఏసు రాణి, కిమ్స్ నుంచి వచ్చిన కౌశిక్, ఎ.నరేష్ వైద్యపరీక్షలు జరిపారు. 32 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, ఎంపీటీసీ మట్ట వెంకటరమణ, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, ఎంపీహెచ్ఎస్ కె.సుధాకర్, పీహెచ్‌ఎన్ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో గురువారం నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. దాత దూలం నాగేశ్వరరావు సహకారంతో 150 మందికి అందజేశారు. సేవాసమితి సభ్యులు పేదలకు ఇంటికి నేరుగా వెళ్లి అందించారు.

బంగారు ఆభరణాల బ్యాగ్ దొరికింది

సీతానగరం: గ్రామానికి చెందిన అడబాల అనుపమ పోగొట్టుకున్న బంగారు ఆభరణాల బ్యాగ్ దొరికింది. ఆమె బుధవారం తిరుపతికి వెళ్లడానికి రాజమహేంద్రవరం వెళుతుండగా ఆటోలోంచి బ్యాగ్ పడిపోయిన విషయం తెలిసిందే. రోడ్డు మీద పడిపోయిన ఆ బ్యాగ్ జాలిమూడికి చెందిన యువకులకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా కనిపించింది. వారు దాన్ని తీసుకుని వెళ్లిపోయారు. కాగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేయగా విషయం తెలిసింది. దీంతో యువకులు ఆ బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించారు. అందులోని బంగారు ఆభరణాలన్నీ సక్రమంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బ్యాగ్ అందించిన యువకులు అభినందించారు.